

# పార్కులకు రక్షణేది!

- ప్రభుత్వ స్థలాలపై కాంగ్రెస్ కన్ను
- నందనవనం పార్కు కబ్జాకు యత్నం
- 20 మంది బౌన్సర్లతో బోర్డు తొలగింపు
- అడ్డుకున్న కాలనీ వాసులు
- కేసు నమోదు చేసిన పోలీసులు

జవహర్‌నగర్, మార్చి 12: కాంగ్రెస్ పాలనలో పార్కులకు రక్షణ లేకుండా పోయింది. చెరువులు, ప్రభుత్వ స్థలాలు కాపాడుతామంటూ గొప్పలు చెబుతూ హైడ్రాను కేటాయించి హంగామా సృష్టించిన సీఎం రేవంత్‌రెడ్డికి నందనవనం పార్కు కనిపిస్తా లేదా అంటూ జవహర్‌నగర్ ఆనంద్‌నగర్ కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని 15వ డివిజన్ ఆనంద్‌నగర్‌కాలనీలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నందనవనం పార్కుకు 17 గుంటలు కేటాయించిన రూ. 35లక్షలతో సుందరీకరణ, జిమ్ పరికరాలతో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో నందనవనం పార్కును నామరూపాల్లేకుండా కబ్జాచేద్దామని చూస్తున్న బడానేతల భరతంపట్టి పార్కును కాపాడాలని ఆనంద్‌నగర్‌కాలనీవాసులు కోరుతున్నారు. పట్టపగలే 20మంది బౌన్సర్లు, కిరాయి మనుషులతో నందనవనం పార్కు వద్దకు వచ్చి పార్కు బోర్డును తొలగించి లోపలికి ప్రవేశించి జిమ్ పరికరాలు, ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఆనంద్‌నగర్‌కాలనీవాసులు ప్రాణాలకు తెగించి బౌన్సర్లను అడ్డుకునేందుకు వెళ్లగా బౌన్సర్లు తిరగబడ్డారు. వెంటనే కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించగా... ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. పార్కును తమ కాలనీకి లేకుండా చేయాలని చూస్తున్న దుండగులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో కబ్జాలకు కొదవలేదని, ప్రభుత్వ స్థలాలు మిగిలేలా లేవని, ప్రజలు సేదతీరేందుకు పార్కులు దక్కేలాలేవని జవహర్‌నగర్ ప్రజలు మండిపడుతున్నారు. నందనవనం పార్కు కబ్జా చేయాలని చూస్తే ఊరుకునేదిలేదని, మరో పోరాటానికి సిద్ధమవుతామని కాలనీవాసులు అన్నారు. ప్రభుత్వ ప్రాపర్టీ నందనవనం పార్కును ధ్వంసం చేసిన దుండగులపై జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని కమిషనర్ వసంత తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



ఆనంద్‌నగర్ కాలనీవాసులతో వాగ్వాదానికి దిగిన బౌన్సర్లు



మన్సురాబాద్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి

## అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకుంటా

మన్సురాబాద్, మార్చి 12: కాలనీల్లో కొత్తగా ఇండ్లు నిర్మిస్తున్న ప్రజలను కొందరు రాజకీయ నేతలు (బీఆర్‌ఎస్ కాదు) బెదిరింపులకు గురి చేసి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి తెలిపారు. సరస్వతీ నగర్, టీ నగర్, వీరన్న గుట్ట, విజయనగర్ కాలనీలలో రూ. 71 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయ నాయకుల అక్రమ వసూళ్లపై తన దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటానని తెలిపారు. కాలనీల్లో నూతనంగా భవనాలను నిర్మిస్తున్న వారు జీహెచ్‌ఎంసీ నుంచి సరైన అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. జాతీయ రహదారి నుంచి కాలనీలకు వెళ్లే రోడ్లు అస్తవ్యస్తంగా మారాయని తెలిపారు. జాతీయ రహదారి విస్తరణ పనుల వలన కాలనీలకు వెళ్లే రోడ్లపై కంకర వేసి వదిలేయడం వల్ల వాహనదారులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మన్సురాబాద్ డివిజన్ హయత్ నగర్ పరిధిలోని పలు కాలనీలలో ట్రంక్‌లైన్ పనులను కొందరు రాజకీయ నాయకులు కావాలని అడ్డుకుంటున్నారని ఎవరెన్ని అడ్డంకులు సృష్టించిన పనులు పూర్తి చేస్తానని తెలిపారు. మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, నాయకులు పోచబోయిన జగదీశ్‌యాదవ్, జక్కిడి రఘువీర్ రెడ్డి, రుద్ర యాదగిరి, కేకేఎల్ గౌడ్, ఆనంద్ యాదవ్, పారంద నర్సింగ్‌రావు, కుమార్, భాస్కర్ యాదవ్, మహేశ్‌తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నేతలు

## ఉద్యమకారులను ఆదుకోవాలి

రవీంద్రభారతి, మార్చి12 : గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మిలియన్ మార్చ్ ప్రోగ్రాంకు కవులు,కళాకారులు, ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబసభ్యులు, సీపీఐ, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పీవో డబ్ల్యూ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు. అనంతరం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కమిటీ హైదరాబాద్ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కమిటీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి,సెక్రటరీ ప్రఫుల్ రాంరెడ్డి, బత్తుల సోమన్న, చంద్రన్న ప్రసాద్, కోతి మాధవి రెడ్డి, వేముల యాదగిరి, డీలర్ యాదగిరి మాట్లాడుతూ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, ప్రతి నెలా రూ. 30 వేల పింఛన్, రూ. 20 లక్షల బీమా ,వంద ఎకరాల్లో ఉద్యమకారుల స్మృతివనం, ఇంటికో ఉద్యగం , జిల్లా కేంద్రాల్లో స్మృతి వనాలు, ఉద్యమకారులకు ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.



**హోలీ సందడి** నగరంలో హోలీ సందడి మొదలైంది. హోలీ పండుగ సందర్భంగా దుకాణాల వద్ద రకరకాల రంగులు సిద్ధంగా ఉంచారు. రంగు నీళ్లు పిచికారీ చేసేందుకు తుపాకీ ఆకారంలో ఉన్న సామగ్రి చిన్నారులను ఆకర్షిస్తున్నాయి. వేర్వేరు కలర్లతో ఏర్పాటు చేసిన డబ్బాలు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి.



మాట్లాడుతున్న బీసీ నాయకులు గుజ్జ కృష్ణ, కోలా జనార్దన్

## 15న బీసీల రౌండ్ టేబుల్ సమావేశం

కాచిగూడ,మార్చి 12: దేశ సంపదనను ప్రధాని మోదీ గుజరాత్ రాష్ట్రానికి కట్టబెడుతున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆరోపించారు. బీసీ రాష్ట్ర నాయకుడు కోలా జనార్దన్ గుజ్జ కృష్ణ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో వివిధ సంఘాల నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15న ఓబీసీ డెమోక్రటిక్ జే ఏసీ ఆధ్వర్యంలో కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్లో రౌండ్ టేబుల్ సమావేశం (అఖిలపక్ష సమావేశం) నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. నీలం వెంకటేశ్, సుధాకర్, నందగోపాల్, ఉదయ్‌కుమార్, జయంతి, రాజు నేత, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కృష్ణస్వరూప్, డా.విఎల్‌రాజు

## కాంగ్రెస్ పార్టీని బొందపెడుతాం

రవీంద్రభారతి,మార్చి12: ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదిస్తే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీని బొందపెడుతామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా.విఎల్ రాజు హెచ్చరించారు. బుధవారం బషీర్‌బాగ్‌లో నిర్వహించిన సమావేశంలో డా.విఎల్‌రాజు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డా.విఎల్‌రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ, బీజేపీలు కుమ్మకై ఓటుబ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ అంశం మీద రాజ్యాంగ నింబంధనలు సుప్రీంకోర్టు వారు ఇచ్చిన తీర్పును సైతం ఉల్లంఘిస్తున్నారని అన్నారు. ఇప్పటికే ఎస్సీవర్గీకరణకు వ్యతిరేకంగా స్టే రావాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో పలు రిట్ ఫిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని అయినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందన్నారు.



## పల్లె రవికుమార్‌కు ఎమ్మెల్సీ కవిత పరామర్శ

చంపాపేట/ ఆర్కేపురం మార్చి 12: కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్‌కు కాలుకు ఫ్రాక్చర్ కావడంతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం పరామర్శించారు. మంగళవారం తెలంగాణ భవన్ లో మాజీ సీఎం నిర్వహించిన సమావేశంలో పాల్గొనేందుకు పల్లె రవికుమార్ వెళ్లగా కారుదిగి రోడ్డు దాటుతున్న క్రమంలో కిందపడటంతో కాలుకు ఫ్రాక్చర్ అయింది. వైద్యులు పరీక్షించి మూడు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కవిత , ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకరరెడ్డితో కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్ రెడ్డి, జిట్ట రాజశేఖర్ రెడ్డి, జీవీ సాగర్ రెడ్డి, జిన్నారం విఠల్ రెడ్డి, తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు అర్చన ఉన్నారు.

## మోజాంజాహీ మార్కెట్‌లో తనిఖీలు

సిటీబ్యూరో, మార్చి 12 (నమస్తే తెలంగాణ): మామిడి పండ్ల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారుల సూచనల మేరకు మోజాంజాహీ మార్కెట్‌లో బుధవారం పండ్ల విక్రయదారులు పండ్ల పక్వానికి నిషేధిత కార్బైడ్‌ను ఉపయోగిస్తున్నారన్న అంశాన్ని పరిశీలించేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు, డిజిగ్నేటెడ్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ వాహనం, ల్యాబ్ టెక్నిషియన్‌లు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, పోలీస్ టాస్క్ ఫోర్స్ బృందం పాల్గొని అవగాహన కల్పించారు. ఎంజే మార్కెట్‌లోని బాలాజీ ఫ్రూట్ మర్చెంట్, కాశ్మీర్ ఫ్రూట్ హౌస్, ఎన్‌ఎస్‌బి ఫ్రూట్ హౌస్, మదీనా ఫ్రూట్‌హౌస్, క్రిస్పీ ఫ్రూట్ హౌస్‌లను తనిఖీ చేశారు. తనిఖీల అనంతరం మోజాంజాహీ మార్కెట్‌లోని పండ్ల వ్యాపారులకు కార్బైడ్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, పండ్ల పక్వానికి తెలంగాణ ఆహార భద్రత కమిషనర్ సూచనలను పాటించాలని, అదే విధంగా అనుమతించిన పదార్థాలను మాత్రమే పండ్ల పక్వానికి వినియోగించాలని అవగాహన కల్పించారు. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం 2006 ప్రకారం పండ్లను పండింగ్ పద్ధతులను అనుసరించాలని అవగాహన కల్పించారు.




పండ్ల విక్రయదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



దీక్షలో కూర్చున్న ఎంఎస్‌ఎఫ్ నాయకులు

## సీఎం రేవంత్‌ను భూస్థాపితం చేస్తాం

ఉస్మానియా యూనివర్సిటీ : మాదిగ విద్యార్థులు, నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిన సీఎం రేవంత్ రెడ్డిని రాజకీయంగా భూస్థాపితం చేస్తామని ఎంఎస్‌ఎఫ్‌నాయకులు హెచ్చరించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం కాకముందే వివిధ పోటీ పరీక్షల ఫలితాలు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఓయూ ఆర్ట్స్‌కళాశాల ఆవరణలో ఎంఎస్‌ఎఫ్‌ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి దీక్షను భగ్నం చేశారు. విద్యార్థి నేతలను అదుపులోకి తీసుకొని బొల్లారం పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఎంఎస్‌ఎఫ్‌నాయకులు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మూడు దశాబ్దాల పోరాటంతో సాధించిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను, మాదిగ జాతి నోటికాడి ముద్దను రేవంత్ రెడ్డి ప్రభుత్వం దూరం చేస్తోందని మండిపడ్డారు. వర్గీకరణ చేయకుండా ఉద్యోగాలను భర్తీ చేయడం వలన మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వాపోయారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎంఎస్‌ఎఫ్‌నాయకులు కొమ్ము శేఖర్, డాక్టర్ పల్లెర్ల సుధాకర్, రాజు, పరశురాం, జనపాల మహేశ్, మంద అనిల్, కాసర్ల సైదులు, సిద్ధార్థ, నరేశ్, సతీశ్, విజయ్, రవీందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి


సిటీబ్యూరో, మార్చి 12(నమస్తే తెలంగాణ): ప్రజలు అనేకసమస్యలతో ప్రభుత్వ ఉద్యోగుల వద్దకు వస్తుంటారని వాటిని పరిష్కరించడం బాధ్యతగా భావించి పరిష్కరించే దిశగా కృషి చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో బుధవారం జరిగిన చర్చ కార్యక్రమంలో పౌర కేంద్రీకృత పాలనలో ప్రజావాణి, ప్రజాపాలన పాత్ర అనే అంశంపై రంగనాథ్ మాట్లాడారు. ప్రజా సమస్యలను పరిష్కరించే వేదికగా ప్రజావాణి నిలుస్తున్నదని, అంతేకాకుండా ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం కలిగిస్తుందన్నారు. ప్రజల సమస్యలన్నీ సంప్రదింపులు, సరైన సూచనలతో పరిష్కారమవుతాయని, కేవలం 20శాతం మాత్రమే జటిలంగా ఉంటాయన్నారు. సమస్యలు పరిష్కారం కానప్పుడే ప్రజలు తీవ్రంగా పరిగణిస్తారని, నక్సలిజం వైపు వెళ్లిన కొందరితో మాట్లాడినప్పుడు చిన్నచిన్న కారణాలు కనిపించాయని రంగనాథ్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని గూగుల్ ఎన్‌ఆర్‌ఎస్‌సీ, సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌ల ద్వారా చూపించి సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ డా.చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ కలెక్టరేట్, మార్చి12: రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజ్‌లో (ఆర్ఐఎంసీ) డెహ్రాడూన్ (ఉత్తరాఖండ్)లో 8వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి విజయకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రాంత విద్యార్థులకు జూన్ 1వ తేదీన (ఆదివారం) పరీక్షను డైరెక్టర్ యన్‌సీఆర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు scert. telangana. gov. in లో దరఖాస్తులను (RIMC) వెబ్‌సైట్ నుంచి సేకరించి పూర్తి అప్లికేషన్ ఫారంలను పూర్తిచేసి రెండు ప్రతులను ఈ నెల 31 లోపు డైరెక్టర్ ఎస్సీఈఆర్టీ , ఎల్బీ స్టేడియం, బషీర్‌బాగ్, హైదరాబాద్ లో అందజేయాలని తెలపారు.

## పెరుగుతున్న క్రానిక్ కిడ్నీ వ్యాధిగ్రస్తులు

సిటీబ్యూరో, మార్చి 12 (నమస్తే తెలంగాణ): నగరంలో క్రానిక్ కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుందని స్టార్ హాస్పిటల్ నెఫ్రాలజిస్టు డాక్టర్ గందే శ్రీధర్ అన్నారు. అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన 'ప్రేరణాత్మక అనుభవాలు– జీవిత విజయ కథనాలు' అనే ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ప్రతి10 లక్షల మందిలో సుమారు 800 మంది వరకు క్రానిక్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారని, హైదరాబాద్ జనాభాలో దాదాపు 8,800 మంది ఈ సమస్యతో బాధపడుతూ డయాలసిస్ లేదా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ అవసరాన్ని ఎదుర్కొంటున్నట్లు వివరించారు. ప్రతి సంవత్సరం నగరంలో సుమారు 1,200 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని, ఈ సంఖ్య 2025 నాటికి 1,400కి పెరిగే అవకాశం ఉందన్నారు. యురాలజిస్టు డా. గుంటపల్లి చిన్న మాలకొండయ్య మాట్లాడుతూ సీకేడీ ఉన్న చాలా మంది రోగులు ట్రాన్స్ ప్లాంట్ గురించి భయపడుతూ, డయాలసిస్ పై ఆధారపడిపోతున్నారన్నారు. నెఫ్రాలజిస్టు డా. జ్యోత్స్న మాట్లాడుతూ సీకేడీని నిరోధించాలంటే ప్రజలు వార్షిక ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం, జీవన శైలిని మార్చుకోవడం చాలా అవసరమని, సమస్యను మొదటి దశలోనే గుర్తించి, చికిత్స తీసుకుంటే, కిడ్నీ సమస్యలను అధిగమించవచ్చన్నారు.



స్టార్ దవాఖానలో నిర్వహించిన కిడ్నీ దినోత్సవంలో పాల్గొన్న వైద్యులు

## తాగునీటితో బైక్ వాష్

సిటీబ్యూరో, మార్చి 12(నమస్తే తెలంగాణ): తాగునీటిని వృథా చేస్తున్న వారిపై కఠిన చర్యలు ఉంటాయని వాటర్ బోర్డు మరోసారి స్పష్టం చేసింది. ఈనెల 5న జూబ్లీహిల్స్‌లోని ఓ ఇంటి యజమాని బైక్ వాష్ చేసేందుకు వాటర్ బోర్డు నీటిని వినియోగించడంతో స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన వాటర్ బోర్డు డివిజన్–6 మేనేజర్ తనిఖీ చేసి ఇంటి నంబర్ 8–2–293/82/జే/ఏ/20లోని శోభకు రూ. 1000 ఫైన్ వేశారు. వాటర్ బోర్డు పరిధిలో తాగు నీటిని వృథా చేసినట్లు అయితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



ధర్నాలో పాల్గొన్న అఖిల పక్షం నాయకులు

## ఫోర్త్ సిటీలో నేదునూరును కలుపాలి

కందుకూరు ,మార్చి 12: ఫోర్త్ సిటీలో నేదునూరు గ్రామాన్ని కలుపాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ గ్రామాన్ని ఫోర్త్ సిటీలో కలుపకుండా అన్యాయం చేస్తుందని అన్నారు. బుధవారం హైదరాబాద్ శ్రీశైలం రహదారి నేదునూరు గేటు వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు . మాజీ వైస్ ఎంపీపీ గంగుల సమంత ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి , మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, సీపీఎం మాజీ కార్యదర్శి కుమార్ , పడమటి సురేందర్ రెడ్డి ,వెంకటేశ్ మాట్లాడుతూ ఫోర్త్ సిటీలో తమ గ్రామాన్ని కలుపుకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని తెలిపారు. లేనిపక్షంలో ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో రాకేశ్ గౌడ్ ,రూప్ చందర్, ,శ్రీధర్ ముదిరాజ్,సురేశ్, మనోహర్, అమరేందర్‌రెడ్డి, రవీందర్ గౌడ్, బాల్‌రాజ్, సాయిలు యాదయ్య పాల్గొన్నారు.

## చెరువుల పరిరక్షణకు సెక్యూరిటీ

సిటీబ్యూరో, మార్చ్12(నమస్తే తెలంగాణ): ఔటర్ పరిధిలో ఉన్న చెరువుల్లో మట్టి పోయడం, తవ్వకాలు సాగించడం వంటి చర్యలను హైడ్రా సీరియస్‌గా తీసుకుంది. ఇటీవల కాలంలో వరుసగా ఘటనలు జరుగుతుండటంతో కూల్చేసిన ప్రాంతాల్లో చెరువుల పరిరక్షణ కోసం హైడ్రా చర్యలు మొదలుపెట్టింది. ఓఆర్ఆర్ పరిధిలో ఉన్న 70 చెరువుల వద్ద ప్రత్యేక సెక్యూరిటీని ఏర్పాటు చేసింది. ఒక్కో చెరువు వద్ద ఏడుగురు చొప్పున 490 మందిని రక్షణ సిబ్బందిగా నియమించింది. వీరంతా మూడు షిఫ్ట్‌ల్లో పనిచేస్తారు. పోలీస్ నియామక పరీక్షల్లో ఒకట్రెండు మార్కులతో మిస్ అయినవారిని ఈ సెక్యూరిటీ సిబ్బందిగా నియమించుకున్నట్లు హైడ్రా సిబ్బంది తెలిపింది. వీరందరిని ఔట్ సోర్సింగ్ కింద తీసుకుని అందరికీ శిక్షణ కూడా ఇచ్చారు. చెరువుల వద్దకు ఎవరైనా అనుమానాస్పదంగా వస్తే వారిని నిలదీయడం, నిలువరించడం ఈ సిబ్బంది డ్యూటీగా హైడ్రా అధికారులు తెలిపారు.